"శరీరంలో ఏ అవయవానికి బాధకలిగినా ఆరాటపడుతుంది
మనస్సు!... ఆప్తమిత్రులలో ఎవరికి ఆపదవచ్చినా
తక్కినవారికి బాధ కలుగక మానదు.
'స్నేహం' లోని 'సత్యం' అది...
అటువంటిస్నేహమే... "

# అమృతవాహిని

ఆరోజు మధ్యాహ్నం ఆఫీసులో పని చూసుకుంటున్న నాముందు ఒక ఉత్తరాన్ని పడేశాడు 'పోస్టుమాన్' అది హనుమంతరావు వ్రాసిన ఉత్తరం అనేవిషయం– దానిమీది వ్రాతను చూసేసరికి తెలిసింది. ఉత్తరాలు వ్రాయటంలో 'పరమ బద్ధకస్తు' డని పేరు గడించుకొన్న నాప్రియమిత్రుడు హనుమంతు లోగడ నేనేమీ ఉత్తరాలు వ్రాసి వుండక పోయినా తాను పనిగట్టుకొని వ్రాశాడంటే అందులో ఏదో విశేషం వుండి వుండాలి! కాగితం కలం పక్కనుంచి– ఉత్తరం తీసి చదివాను. ఆవుత్తరంలోని విషయాలన్నీ ఒక ఎత్తు! ఆఖర్న వ్రాసిన ఆవాక్య మొక్కటీ ఒక ఎత్తు. చదివిన దానినే మళ్ళీ మళ్ళీ చదువుకున్నాను. ఏదో చెప్పలేని ఆవేదన నాహృదయాన్ని కలవరపెట్టింది. మనసంతా వికలమయిపోయింది. ఇక ఆఫీసులో కూర్చోలేక– పర్మిషన్ తీసుకొని ఇంటికి వచ్చేశాను. ప్రతిరోజూ ఆరుగంట లయాక కూడా ఇంటికి చేరుకోని నేను– ఆరోజు మూడుగంటలకే వచ్చేసరికి ఆశ్చర్యపడి కారణం అడిగింది పార్వతి. జేబులోంచి ఉత్తరం తీసి చూపించాను. అంతా చదివి 'అయ్యో పాపం' అని నిట్టూర్చింది. నేను బట్టలు మార్చుకునేసరికి కాఫీ తీసుక వచ్చి టేబిల్ మీద పెట్టి, రేడియో ట్యూన్ చేసింది పార్వతి. నాకు తెలుసు నేను పడుతున్న ఆరాటాన్నీ, ఆవేదననూ మరపించి, మనసు మరోవైపుకు మళ్ళించటానికే పార్వతి రేడియో

పెట్టిందని. కానీ రేడియో వినటంకూడా నాకు చిరాకని-
పించింది.

ఆరోజు రాత్రి భోజనం చేస్తుంటే పార్వతి అంది- 'తప్పు చేశాడుకనుకనే శిక్ష అనుభవించాడు' అని. నాకు చాలా కోపం వచ్చింది.

"ఎవరిది తప్పు? కట్టుకొన్న మొగుడి కన్ను గప్పి పరాయి మగవాడితో ... ఛీ ..." కోపంలోనూ ఆవేశం లోనూ అంతకన్న ఎక్కువగా మాట్లాడలేకపోయాను. తిన్న అన్నం వంటబట్టలేదు. పడుకున్నతర్వాత నిద్రయినా పడు తుందేమో ననుకుంటే- ఆలోచనలు దానినికూడా దూరం చేశాయి.

* * *

నేనూ, చంద్రశేఖరం, హనుమంతూ ఒకేవూరిలో పుట్టి పెరిగాం! శేఖరం కలవారింట్లో పుట్టినా కన్న తల్లి ప్రేమకు నోచుకోని దరదృష్టవంతుడు. ఆవూరిలో స్కూలు ఫైనలు పూర్తి కాగానే ఒకేకాలేజీలో నాలుగేళ్లు చదివాం! శలవ లిచ్చినపుడల్లా మావూరు వెళ్లేవారం! ఒకరి కష్టసుఖా లను వేరొకరు పంచుకొనే స్నేహం మాది. బి. ఏ. మొదటి సంవత్సరం చదువుతుండగనే శేఖరానికి వివాహ మయింది. చదువు పూర్తి అయ్యాక ఏదయినా వృత్తిలో స్థిరపడేవరకూ పెళ్ళి చేసుకోకూడదని అనుకున్నాం ఒకసారి. కానీ శేఖరం

తండ్రి ఒకరోజున హఠాత్తుగా మా రూమ్‌కు వచ్చి, పెళ్ళికూతుర్ని చూసుకునేందుకు శేఖరాన్ని బయల్దేర మన్నాడు. తండ్రి అంటే చాలా ప్రేమా, గౌరవమూ వున్నాయి శేఖరానికి. తన చిన్నతనంలోనే తల్లిపోయినా మళ్ళీ పెళ్ళి చేసుకుంటే తనకొడుక్కు సవతితల్లి ఆరడి తప్పదనే తలంపుతో ఆయనే కన్నతల్లిగా శేఖరాన్ని ఎంతో గారంతో పెంచి పెద్దచేశారు. అందుకనే తనతండ్రిమాటకు శేఖర మెప్పుడూ ఎదురు చెప్పడు. మొత్తానికి శేఖరం పెళ్ళి చేసుకున్నాడు. ఆడదిక్కులేని కొంపలో వంటమనిషి ఇంత వండి పెడుతోంటే తినలేక తిని తన మనోవ్యథను మరియొకరికి తెలియనీయక గుట్టుగా కాలం వెళ్ళబుచ్చుతున్న తనతండ్రిని చూసినపుడల్లా గుండె లవిసిపోయేవి శేఖరానికి అసలు తను పెళ్ళి చేసుకోవటంలో ముఖ్యోద్దేశ్యం అదే. సుశీలను పెళ్ళిచేసుకొని వెంటనే కాపురానికి తీసుకవచ్చినా తానింకా ఒకసంవత్సరం కాలేజీలో చదవాలి కనుక ఆమెను తనతండ్రి పరిచర్యల కోసం- శేఖరం తిరిగి మాతో కలిశాడు. పండుగలకూ ఇతర శెలవలకూ ఇంటికి వెళ్ళి-వస్తూ వుండేవాడు బి ఏ. పరీక్షలకు శ్రద్ధగానే చదివాం. కాని శేఖరం మాత్రం అన్యమనస్కుడై చదివేవాడు. ఎక్కువగా ఆలోచిస్తుండేవాడుకూడా. నేనూ, హనుమంతూ- 'భార్యగురించి ధ్యాస ఎక్కువయింది' అని అతన్ని హేళన చేసేవాళ్ళం. శేఖరం నవ్వేవాడు. అ[illegible] జీవం లేని నవ్వు; విరక్తితో కూడిన నవ్వు.

"చివరకు శేఖరం పరీక్ష తప్పింది."

శేఖరం ఎక్కువబాధపడకపోయినా- అతనికి ప్రోత్సా హమిచ్చి మళ్లీ చదువమన్నాం "చూదాంలే!" అన్నాడు. ఆ శెలవులలోనే నేను ఉద్యోగరీత్యా ఇక్కడకు వచ్చేశాను. నేను వెళ్ళిన నెలలోజులకే కాబోలు- 'సెంట్రల్ గవర్న మెంట్'లో ఏదో ఉద్యోగం వస్తే - హనుమంతుకూడా వెళ్లి పోయాడు. శేఖరం మావూళ్ళోనే ఏదో ప్రయివేటు కంపె నీలో చిన్నపనిలో ప్రవేశించాడు. ప్రతిపండుగకూ- ఇంటికి వెళ్ళినప్పుడు ముగ్గురం కలుసుకోవటం, కష్టసుఖాలు మాట్లాడు కోవటం జరిగేది. కానీ శేఖరంలో ఏదో మార్పురావటం- నేనూ హనుమంతూ గమనించాం!

* * *

ఒంటరిగా పడుకొని ఆలోచిస్తున్న నేను అడుగుల చప్పుడు విని, తిరిగి వాస్తవానికి వచ్చాను. పార్వతి ఇచ్చిన వక్కపొడి తీసుకున్నాను. "కనీసం ఈసంగతి ముందుగా తెలియపరచి వుంటే- ఒకసారి శేఖరాన్ని చూసే భాగ్యం కలిగేదేమో!" అన్నాను.

"అయిపోయినదానికి బాధపడి ప్రయోజనం ఏమిటి చెప్పండి-? అదంతా ఒక 'పీడకల' అనుకొని మరచిపొండి" అంది పార్వతి అనునయంగా.

పదిహేనేళ్ళుగా కలిసిమెలసి తిరిగి, ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకొని స్నేహంలో అమరత్వాన్ని చూడగలిగిన మేము- మాలో ఒకరినొకరు ఎలామర్చిపోగలం? నాలో అంతసహనశక్తి లేదు. అంతటిశక్తి హనుమంతులో కూడా వుందని అనుకోను. అందుకనే ఉత్తరంలో ఆవాక్యాన్ని ముందుగా వ్రాయలేక- ఆఖర్ని వ్రాశాడు. ఉత్తరం గుర్తుకు రావటంతో- లేచి- డ్రాయరుమీదనున్న- ఆవుత్తరాన్ని తీసి- అదే వాక్యాన్ని నిశితంగా చూశాడు.

"శేఖరాన్ని మొన్నఆదివారం ఇక్కడ సెంట్రల్ జెయిల్‌లో ఉరితీశారు"- ఉత్తరంలోని ఇతరవిషయాలన్నీ ఒక ఎత్తు. ఇదొక్కటీ ఒక ఎత్తు. ఇతరవాక్యాలలోని అక్షరాలు- గుండ్రంగా పొందికగా వుంటే- ఈమాటలు చెల్లాచెదురుగా- వణుకుతున్న చేతితో వ్రాసినట్లు- పేలవంగా వున్నాయి. శేఖరం పైనున్న ప్రేమ- వాత్సల్యమూ- అన్నీ కలసి- ఆమాటను సరిగా వ్రాయనీయలేదు. అందులోనూ శేఖరం అంటే హనుమంతుకు వల్లమాలిన ప్రేమ. ఒకసారి మేము రూమ్‌లో వుండగా- అర్ధరాత్రివేళ శేఖరానికి కడుపులో నొప్పివచ్చింది. ఎక్కడో సినిమాహాలుదగ్గరకు వెళ్ళి- ఎక్కువడబ్బులిచ్చి- సోడాబండివాణ్ణి తీసుకవచ్చాడు హనుమంతు. శేఖరంమీద అంతటి ప్రేమానురాగాలు వున్న హనుమంతుకు- ఆవిషయాన్ని వ్రాయటానికి- చేతిలోని

కలం నడిచివుండకపోవచ్చు. గడియారం గంటలు కొడు తోంది. పదకొండు గంటలయినా నిద్రపోవా లనిపించటం లేదు. ఆలోచనలు- ఒకటొకటిగా- ఉక్కిరిబిక్కిరి చేస్తు న్నాయ్ !

*　　　*　　　*

ఒక ఆదివారం ఉదయం హఠాత్తుగా- మాయింటికి వచ్చాడు శేఖరం- "ఉత్తరంముక్కయినా వ్రాయకుండా వచ్చేశావేమిటి ?" అని అడిగాను. "తర్వాత చెబుతానులే"- అన్నాడు మామూలు ధోరణిలో. కానీ ఎందుకో శేఖరం తడబడటం గ్రహించాను. ముఖంలో కళాకాంతులు ఏకో శానా కనిపించలేదు ఆసాయంత్రం పార్కులో- అసలు విషయం చెప్పాడు. అంతాచెప్పి- "నన్ను నువ్ రక్షిం చాలిరా !" అంటూ చేతులు రెండూ పట్టుకున్నాడు. అతని మాటలలోని ఆవేదనా- ముఖంలోని దీనత్వం నామనసును కలవరపెట్టాయి. శేఖరం అంతపనిచేస్తాడని అనుకోలేదు. అసలు అంతధైర్యం అతనిలో వున్నదనికూడా నాకు తెలియదు.

"కానీ నువ్ తొందరపడ్డావురా"- అన్నాను నేను.

"అవును ! తొందరేపడివుంటాను. కానీ ఆవేశంలో చేసేశాను. నేనేం చేస్తున్నానో నాకే తెలియలేదు. పీక నొక్కినంతమాత్రాన చచ్చిపోతుందని అనుకోలేదు. అయినా

అదిచేసిన పాపానికి- ఆశిక్ష- భగవంతుడే- నాచేత విధింపచే
శాడేమో! — అది పతిత! .... వాడికీ దానికీ ఎంతో
కాలమునుండీ సంబంధంవుంది ... వాళ్ళిద్దరూ కులుకు
తూంటే నేను కళ్లారా చూశాను ... నిన్నరాత్రి స్నేహితు
రాలితో సినీమాకు వెడతానంది. అనుమానాన్ని బుజువు
చేసుకునేందుకు- నేనూ వెంబడించాను. అంతా వట్టిది.
స్నేహితురాలు కాదు ... ఎవడో స్నేహితుడు ... తిరిగి
ఇంటికి వచ్చాక- ఆకోపంలో- ఆవేశంలో- కొట్టాను.
"నేనూ అతనూ ప్రేమించుకున్నాం! పెద్దవాళ్లు మామాట
వినకుండా నన్నుమీకు కట్టబెట్టారు. నా శరీరాన్ని మీకు
వివాహం చేసుకున్నారు"- అంటూ ఏడిచింది సుశీల. ఆ
మాటలు అగ్నిలా మండే నా గుండెలలో ఆజ్యంపోసినట్ల
య్యాయి కోపంలో ఆమెపీక నొక్కేశాను. అంతే-"
రెండుక్షణాలు ఆగి- నుదుటిమీద పట్టిన చెమటను తుడుచు
కొని మళ్లీ అన్నాడు- శేఖరం- "ఈవిషయం ఇంతవరకూ
రెండవకంటివానికి తెలియదు ... పొద్దున్నే బయలుదేరి
ఇలా వచ్చేశాను- ఈ హత్యసంగతి ఎలాగయినా బయట
పడవచ్చు. నామీద పోలీసులకు అనుమానం కలగకూడదు.
నేను నిన్నరాత్రి నీదగ్గర వున్నట్లు సాక్ష్యం ఇవ్వాలి!"
అన్నాడు శేఖరం.

"అలాగేలే! అధైర్యపడకు..." అన్నాను అతన్ని

ఓదారుస్తూ! కానీ న్యాయానికి కళ్ళులేవనే అపోహలో వున్నాడు శేఖరం. అపరాధంచేసినవానికి ఆసమయంలో అలాగే వుంటుందేమో మరి!

ఆతరువాత నెలరోజులయినా తిరక్కుండానే శేఖరాన్ని 'అరెస్ట్'చేయటం జరిగింది. కూతుర్ని చంపాడనే కక్షతో_ శేఖరంమామగారే స్వయంగా_ ఆధారాలు సేకరించి_ అరెస్టుచేయించారు శేఖరానికున్న ఆస్థియావత్తు కోర్టుపరంఅయినా_ తీర్పు అతనిపక్షాన జరుగనేలేదు. 'సెంట్రల్ జెయిల్'లో దాదాపు సంవత్సరంపైగా వున్నాడు. అప్పుడే నేను అతన్ని కలుసుకున్నాను. శేఖరానికి ధైర్యం చెప్పాలనుకొని వెళ్ళిన నాకే ధైర్యంచాలక_ అతని స్థితి చూసి_ దుఖం పొర్లుకవచ్చింది. నన్ను కౌగలించుకొని_ చంటిపిల్లాడిలా_ విలపించాడు పాపం! 'తనకు త్వరలో వురి శిక్ష పడటం తప్పదనీ_ ఈలోపుగా హనుమంతుని కూడా ఒకసారి చూడాలని ఉన్నదనీ'_ చెప్పాడు. నేను తీసుక వెళ్ళిన 'యాపిల్' పళ్ళు యిద్దరం తిన్నాం_ అదే నేను శేఖరాన్ని ఆఖరుసారిగా చూడటం.

* * *

రెండవఆట సినిమాచూసిన ప్రేక్షకజనం ఇంటికి పోతున్నారుకాబోలు_ బయటనుండి_ మనుష్యులమాటలు_

గోలగా వినబడుతున్నాయి. ఆలోచనలను బలవంతంగా అణచుకొన్నాను చలిగాలి రివ్వుమంటూ కిటికీలోనుంచి దూసుకొని వస్తోంది. పార్వతి నిశ్చింతగా నిదురపోతోంది. నేనూ నిద్రకు ఉపక్రమించాను. ఇంతలోనే ఎదురుగా గోడ మీద వున్న నీడ- శేఖరం ఆకారంలో వుండటం కనిపించింది.

"నా గురించి ఎందుకంతగా బాధపడతావ్? జీవితంలో ఎందర్నో మనం కలుసుకుంటాం! అందరిలో కొందరిపరిచయం- అమృత వాహినిలా- మలయమారుతంలా- తీయగా హాయిగా వుంటుంది. మన స్నేహమూ- అటువంటిదే! కానీ నేను తెలిసో- తెలియకో తప్పుచేశాను- శిక్ష తప్పలేదు..." ఆనీడ మాట్లాడుతోందేమో- అనిపించి- భయమేసింది-! గట్టిగా కళ్ళుమూసేసుకొన్నాను. నిద్ర ఎప్పుడు పట్టిందో నాకే తెలియదు.

---